ఆంధ్రజ్యోతి
andhrajyothy.com



శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 35.2, కనిష్ఠం 21.7

అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్ సీజ్

రాజంపేట, మార్చి 9: రాజంపేట మండలంలో శనివారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను సీజ్ చేసినట్లు ఫారెస్ట్ రేంజ్ అధికారి రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నడిమి తండా గ్రామ రెవెన్యూ పట్టా భూముల నుంచి ఇసుక ఎల్లారెడ్డిపల్లిలో పోసి అక్కడి నుంచి టిప్పర్‌లో ఇసుక నింపుకుని వెళ్తుండగా రాజంపేట వెళ్లే దారిలో బస్వన్నపల్లి గ్రామ సమీపంలో పట్టుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ అధికారి బాబా, సిబ్బంది సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు కసరత్తు



ధాన్యం కొనుగోళ్లపై అధికారులకు దిశా నిర్దేశం చేస్తున్న కలెక్టర్

- ప్రణాళిక సిద్ధం చేస్తున్న అధికారులు
- యాసంగిలో 1.80లక్షల ఎకరాల్లో వరి సాగు
- దిగుబడులపై అంచనాలు సిద్ధం చేస్తున్న అధికారులు
- జిల్లా వ్యాప్తంగా 347 కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయం
- కోతల సమయానికి సిద్ధంగా ఉండాలని ఆదేశాలు

కామారెడ్డి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఈ యాసంగి సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్లకై అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. కొనుగోళ్ల యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఇది వరకే అధికారులతో సమీక్ష నిర్వహించి ఏర్పాట్లు చేసుకోవాలని సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. దీంతో సీజన్‌లో ఎంతమేర వరి సాగైంది, ఏ స్థాయిలో దిగుబడులు వస్తాయి, కేంద్రాలకు ఎంతమేర దిగుబడి వస్తుందనే దానిపై అధికారులు వివరాలు సేకరించనున్నారు.

జిల్లాలో 1.80లక్షల ఎకరాల్లో వరి సాగు

జిల్లాలో ఈ యాసంగి సీజన్‌లో రైతులు వరి సాగుకు మొగ్గు చూపారు. జిల్లా వ్యాప్తంగా 4.32 లక్షల ఎకరాల సాగు భూమి ఉంది. ఇందులో 1.80 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. అయితే యాసంగి సీజన్‌లో సాగైన వరికి తగ్గట్టుగా దిగుబడులు ఎంత వస్తాయనే దానిపై అంచనా వేసే పనిలో పడ్డారు. గతంలో వానాకాలంలో వేసిన వరి పంట విస్తీర్ణంలో సగంకుపైగానే యాసంగిలో సాగు చేసేవారు. ధాన్యం ప్రభుత్వమే రైతుల నుంచి కొనుగోలు చేయడంతో పాటు చాలా మంది రైతులు ఈ పంట సాగుకే మొగ్గు చూపారు. అయితే ప్రస్తుతం ఎంత దిగుబడులు వస్తాయనే దానిపై ఇంకా అంచనాలు రూపొందించలేదు. విస్తీర్ణాన్ని అనుసరించి దిగుబడుల అంచనా వేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

347 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయం

యాసంగి ధాన్యం కొనుగోళ్లకు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. మరో 45 రోజుల్లో జిల్లాలో వరి కొనుగోలు ప్రారంభం అయ్యే అవకాశం ఉంది. దీంతో కొనుగోళ్లపై కలెక్టర్ సంబంధిత శాఖాధికారులతో ఇటీవల సమీక్ష నిర్వహించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి సమస్యలు తలెత్తకుండా కొనుగోలు చేపట్టాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ప్రణాళికను రూపొందించాలని ఆయా శాఖలకు సూచించారు. గతంలో మాదిరిగానే జిల్లాలో మొత్త ం 347 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేం దుకు ప్రణాళికలను రూపొందించాలన్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో 22, సహకార సంఘాల ఆధ్వర్యంలో 325 కొనుగోలు కేంద్రాలను కేటాయించారు. కేంద్రా లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తుగా గన్నీ బ్యాగులను ధాన్యం శుద్ధి చేసే యంత్రాలను సమకూర్చుకోవాలన్నారు.



ట్రాన్స్‌పోర్టు కోసం 10 సెక్టార్లు

యాసంగి సీజన్‌లో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించేందుకు ట్రాన్స్‌పోర్ట్‌కై ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోనున్నారు. ఇందుకోసం 10 సెక్టార్‌లుగా విభజించనున్నారు. ధాన్యం కొనుగోలు పెద్ద సవాల్‌గా ఉండేది. కొనుగోలు కేంద్రాలు తక్కువగా ఉండడం లారీలు గన్నీ సంచుల సమస్య వేధించేది. గత నాలుగు సీజన్‌లుగా పరిస్థితిని అధికారులు అధిగమించారు. కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని తరలించేందుకు 10 సెక్టార్‌లుగా విభజించి లారీలను ఏర్పాటు చేయనున్నారు. ఈ సెక్టార్‌ల వారీగా ధాన్యాన్ని కేంద్రాల నుంచి రైస్‌మిల్లులకు తరలిస్తారు. ట్రాన్స్‌పో ర్ట్ సమస్య తలెత్తకుండా 10 సెక్టార్‌లుగా విభజించినట్లు సంబంధిత శాఖాధికారులు చెబుతున్నారు.

ప్రొటోకాల్ రగడ

- ఆధిపత్యం కోసం కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ
- అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదంటూ బీజేపీ ఆరోపణలు
- ప్రభుత్వ ప్రతినిధిగా షబ్బీర్‌అలీకి ప్రాధాన్యత ఎలా ఇస్తారంటూ నిలదీత
- ప్రొటోకాల్‌ను ఎందుకు పాటించడం లేదంటూ వైద్యులను ప్రశ్నించిన ఎమ్మెల్యే
- ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరు కాని ఎమ్మెల్యే
- అదనపు పడకల ఏర్పాటు గదులను ప్రారంభించిన ప్రభుత్వ సలహాదారుడు

కామారెడ్డి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి నియోజకవర్గంలో ప్రొటోకాల్ రగడ నెలకొంటుంది. స్థానిక ఎమ్మెల్యేకు ప్రాధాన్యత ఇవ్వకుండా ప్రభుత్వ సలహాదారుడికి అధికారులు అందలం ఎక్కిస్తున్నారంటూ బీజేపీ ఆరోపిస్తోంది. ప్రభుత్వ ప్రతినిధిగా అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నామంటూ కాంగ్రెస్ చెబుతోంది. కామారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్, బీజేపీల మధ్య ఆధిపత్య పోరు నెలకొంటుంది. నియోజకవర్గ పరిధిలో ఇటీవల జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల నేపథ్యంలో అధికారులు ప్రొటోకాల్‌ను పాటించడం లేదంటూ ఇరుపార్టీల ప్రజా ప్రతినిధులు, నేతలు ఒకరిపై ఒకరు ఆరోపించుకుంటున్నారు. అధికారిక కార్యక్రమాలను కాంగ్రెస్, బీజేపీలకు చెందిన నాయకులు పోటాపోటీగా చేపడుతుండడంతో అధికారులకు ప్రొటోకాల్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తాజాగా కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో అదనపు పడకల ఏర్పాటు, డయాలసిస్ బెడ్ల పెంపు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆహ్వానపత్రికతో పాటు శిలాఫలకంపై విశిష్ట అతిథిగా ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ పేరును ఎలా చేర్చుతారంటూ స్థానిక ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌తో పాటు వైద్యాధికారులను నిలదీశారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముందే ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి ఆసుపత్రికి చేరుకుని ప్రొటోకాల్ విషయంలో అధికారులను ప్రశ్నించారు. ఆసుపత్రిలో ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఉండకుండానే అక్కడి నుంచి వెళ్లిపోవడంతో చర్చనీయాంశంగా మారింది. ఎమ్మెల్యే వెళ్లిపోయిన కాసేపటికీ ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ అదనపు పడకలను, డయాలసిస్‌లో పెంచిన పడకలను ప్రారంభించారు.

కామారెడ్డిలో అధిపత్యపోరు

కామారెడ్డి నియోజకవర్గంలో అధిపత్యం కోసం కాంగ్రెస్, బీజేపీలు పోటాపోటీగా కార్యక్రమాలు చేపడుతున్నాయి. కామారెడ్డి నియోజకవర్గం నుంచి ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఇద్దరు సీఎంలపై బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకట రమణారెడ్డి విజయం సాధించి రికార్డు సృష్టించిన విషయం తెలిసిందే. అయితే నియోజకవర్గ బాధ్యతలను ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి చూస్తున్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాలతో పాటు సంక్షేమ పథకాల అమలు తీరుపై అధికారులతో పలుమార్లు సమీక్షించారు. మున్సిపల్‌లో సైతం అధికారులతో సమావేశం అయ్యారు. అయితే కాటిపల్లి వెంకట రమణారెడ్డి బీజేపీ ప్రజా ప్రతినిధిగా కావడం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంతో కాంగ్రెస్ ముఖ్యనేతలు అధిపత్యం కొనసాగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే కామారెడ్డి నియోజకవర్గం నుంచి సీనియర్ నాయకుడైన షబ్బీర్‌అలీ ఇటీవల ఎన్నికల్లో నిజామాబాద్ నుంచి పోటీచేసి ఓటమి పాలయ్యారు. కామారెడ్డిలో రేవంత్‌రెడ్డి పోటీ చేసి ఓడిపోయారు. అయితే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో కామారెడ్డి నియోజకవర్గ బాధ్యతలను కాంగ్రెస్ పార్టీ నుంచి షబ్బీర్‌అలీ చూస్తున్నారు. షబ్బీర్‌అలీని ప్రభుత్వ సలహాదారుడిగా కాంగ్రెస్ నియమించింది. అయితే షబ్బీర్‌అలీకి క్యాబినెట్ హోదాతో కూడిన ప్రభుత్వ సలహాదారునిగా నియమించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ప్రతినిధిగా పలు అధికార కార్యక్రమాల్లో షబ్బీర్‌అలీ పాల్గొంటూ వస్తున్నారు. ఇలా కామారెడ్డి నియోజకవర్గంలో ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ వర్సెస్ ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి మధ్య ప్రొటోకాల్ వివాదం నెలకొంటుంది.

ప్రొటోకాల్ విషయంలో అధికారులకు ఇబ్బంది

కామారెడ్డి నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల విషయాల్లో అధికారులకు ప్రొటోకాల్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. క్యాబినెట్ హోదాతో ఉన్న ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ పేరును పలు ప్రభుత్వ కార్యక్రమాల్లో, ఆహ్వాన పత్రికలపై అధికారులు చేర్చడంతో స్థానిక బీజేపీ నాయకులు అధికారులను నిలదీస్తున్నారు. ప్రజల చేత ఎన్నుకోబడని ఓటమి పాలైన వ్యక్తి పేరును అధికారిక కార్యక్రమాల్లో ఎలా చేర్చుతారంటూ బీజేపీ ఎమ్మెల్యేతో పాటు నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు సైతం క్యాబినెట్ హోదా ఉన్న షబ్బీర్‌అలీ పేరు ఎందుకు ఉంచరని అధికారిక కార్యక్రమాల్లో ఎందుకు పాల్గొనవద్దని ప్రశ్నిస్తున్నారు. అటు ప్రభుత్వ ప్రతినిధిగా ఉన్న షబ్బీర్‌అలీ పేరు చేర్చకుంటే ప్రభుత్వంతో ఇబ్బందులు తలెత్తుతాయామోనని, ఇటు స్థానిక ఎమ్మెల్యేకు ప్రాధాన్యత ఇవ్వకుంటే ఎమ్మెల్యే ఆగ్రహానికి ఎక్కడ గురికావాల్సి వస్తుందోనని సంబంధిత అధికారులు ఆందోళనకు గురవుతున్నారు. శనివారం ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన కార్యక్రమమే ఇందుకు నిదర్శనమని అధికార వర్గాలు చెబుతున్నాయి.

అంగరంగ వైభవంగా మల్లికార్జున స్వామి కల్యాణం



తిప్పాపూర్‌లో స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

భిక్కనూరు, మార్చి 9: మండలంలోని తిప్పాపూర్ గ్రామంలోని అటవీ ప్రాంతంలో కొలువుదీరిన మల్లికార్జున స్వామి ఆలయ ఉత్సవాలను యాదవ సంఘం ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ముత్యాల పందిరిలో మల్లిఖార్జున స్వామి, గొల్ల కేతమ్మ, మేడాలమ్మ కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. అంతకుముందుగా స్వామివారి ఉత్సవ విగ్రహాలను యాదవసంఘం ప్రతినిధులు ఊరేగించారు. అనంతరం పెద్దఎత్తున అగ్ని గుండాల కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని తిలకించడానికి తిప్పాపూర్‌తో పాటుగా మండలంలోని ఆయా గ్రామాల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. ఆ మేరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా యాదవసంఘం ఆధ్వర్యంలో జాగ్రత్తలు తీసుకున్నారు. మండల కేంద్రంలోని సిద్ధరామేశ్వర ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం అర్ధరాత్రి 12గంటలకు లింగోద్భవ పూజను నిర్వహించారు. శనివారం సాయంత్రం నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు ఆయా గ్రామాలకు చెందిన భజన మండళ్ల ఆధ్వర్యంలో పెద్దఎత్తున భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాగా మండలంలోని కాచాపూర్‌లో గల వీరేశ్వర స్వామి ఆలయంలో అన్నపూజ, పాలాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

దోమకొండలో ఘనంగా చక్కెర తీర్థం

దోమకొండ: మండల కేంద్రంలోని శివరాంమందిర్ ఆలయంలో శనివారం చక్కెర తీర్థం(జాతర) ఘనంగా జరిగింది. మండలంలోని ముత్యంపేట, సంగమేశ్వర్, అంచనూర్, గొట్టిముక్కుల, లింగుపల్లి, సీతారాంపల్లితో పాటు భిక్కనూర్, మాచారెడ్డి, బీబీపేట మండలాలకు చెందిన భక్తులు శివరాంమందిర్ ఆలయంలో పూజలు నిర్వహించి చక్కెర తీర్థంలో పాల్గొన్నారు. ఉదయం చక్రతీర్థం, నాకబలి, అవబృద స్నానం, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు.

ఘనంగా దక్ష యజ్ఞం

సదాశివనగర్: మండలంలోని శివాలయాల వద్ద ఉదయం పెద్ద ఎత్తున అగ్నిగుండాల కార్యక్రమం నిర్వహించారు. పూజారులు, భక్తులు శివనామస్మరణతో అగ్నిగుండాల ప్రవేశం చేశారు. అనంతరం భగవంతుని సన్నిదానంలో అన్నదాన కార్యక్రమం చేపట్టడంతో భక్తులు ఉపవాస దీక్షలు విరమించారు.

తాడ్కోల్‌లో పారిశుధ్య లోపం

- రోగాల బారిన స్థానికులు
- పట్టించుకోని అధికారులు

బాన్సువాడ, మార్చి 9: సర్పంచుల వ్యవస్థ రద్దయిన నుంచి గ్రామ కార్యదర్శులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. గ్రామాల్లో అపరిశుభ్రత తాండవిస్తోంది. పారిశుధ్య పనులు నిర్వహించే కార్మికులు సైతం పారిశుధ్య పనులు నిర్వహించడంలో అశ్రద్ధ కనబరుస్తున్నారు. పారిశుధ్య పనులను పర్యవేక్షించాల్సిన అధికారులు కేవలం ఇళ్లకే పరిమితమవుతున్నారన్న ఆరోపనలు ఉన్నాయి. బాన్సువాడ మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీగా పేరొందిన తాడ్కోల్ గ్రామ పంచాయతీలో ఇటువంటి సంఘటలు చోటు చేసుకోవటంతో బాన్సువాడ శ్యాసనసభ్యుడు పోచారం శ్రీనివాస్‌రెడ్డి సైతం అధికారుల చర్యల వల్ల ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తోంది. తాడ్కోల్ గ్రామంలో విధులు నిర్వహించే కార్యదర్శి సమయపాలన పటించకపోవటం, గ్రామస్థులకు కావాల్సిన ధ్రువపత్రాలు జారీ చేయటంలో స్థానికులకు ఇబ్బందులకు గురి చేస్తున్న విషయం ఎమ్మెల్యేకు తెలియడంతో అయనే లోలోన మదన పడుతున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. తాను సుదీర్ఘ రాజకీయ అనుభవంతో పేదలు, సామాన్య ప్రజల కోసం చేసిన కృషి ఇటువంటి అధికారుల పనితీరుతో వ్యర్థమవుతోందని, ప్రతిపక్షాల వారికి నా అనుకునే వారే అవకాశం కల్పిస్తున్నారంటూ అనుచరుల వద్ద గోడు వెళ్లబోసుకుంటున్నట్లు విస్వసనీయ వర్గాల సమాచారం.

నామ మాత్రంగా డంపింగ్ యార్డ్

తెలంగాణ ప్రభుత్వం అట్టహాసంగా ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డు కార్యక్రమం తాడ్కోల్ గ్రామంలో నవ్వుల పాలవుతోంది. లక్షలాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన డంపింగ్ యార్డు కేవలం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారటంతో పాటు పేకాటరాయుళ్లకు అడ్డాగా మారుతోంది. బాన్సువాడ పరిసరాల్లో విశాల స్థలాల్లో మద్యం ప్రియులు మద్యపానం తాగాడాన్ని అరికట్టిన పోలీసులు తాడ్కోల్ గ్రామంలో మాత్రం జరుగుతున్న అక్రమ మద్యం తాగడం, మద్యం ప్రియుల ద్వారా స్థానికులకు కలుగుతున్న ఇబ్బందులను మాత్రం ఏ మాత్రం పట్టించుకోవటం లేదన్న ఆరోపణలు పోలీసులపై సైతం ఉన్నాయి.

పట్టించుకోని పోలీసులు



రోడ్డుపైనే వేసిన చెత్త



డంపింగ్ యార్డు

బాన్సువాడ మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో, పట్టణ పరిసర ప్రాంతాల్లో గస్తీ నిర్వహించే పోలీసులు తాడ్కోల్ గ్రామ పరిధిలోని మందుబాబులపై ఎటువంటి చర్యలు తీసుకోవటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రామంలోని కొందరు రాజకీయ నాయకులు కొన్ని గ్రూపులను సిద్ధం చేసి నిత్యం మద్యం తాగేలా చర్యలు తీసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇటువంటి నాయకుల వల్ల గ్రామంలో అరాచక శక్తులు పెట్రేగిపోతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా బాన్సువాడ పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అందుబాటులోకి రాని సెక్రెటరీ

తాడ్కోల్ గ్రామ పంచాయతీ పరిధిలోని అపరిశుభ్ర వాతావణం గురించి గ్రామ కార్యదర్శిని 'ఆంధ్రజ్యోతి' స్వయంగా సంప్రదించి పరిస్థితిపై ఆరా తీయగా ఆమె సక్రమంగా స్పందించలేదు.

చర్యలు తీసుకుంటాం

- సత్యనారాయణ, ఎంపీవో

తాడ్కోల్ గ్రామ పంచాయతీలో జరుగుతున్న అపరిశుభ్రతపై విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు



ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి
కామారెడ్డికి పట్టిన శని

- డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు

కామారెడ్డి టౌన్, మార్చి 9: ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి కామారెడ్డికి పట్టిన శని అని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గెలిచిన 100 రోజుల్లోనే 150 కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని ప్రజలకు మోసపూరిత వాగ్దానాలు చేశాడని అన్నారు. ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడపడానికి ప్రత్యేక నిధులు తీసుకువస్తుంటే జీర్ణించుకోకుండా అవకులు చవకులు పేలుతున్నాడని అన్నారు. రమణారెడ్డి ఖబర్దార్ అభివృద్ధి చేయడం చేతకాకపోతే ఇంటి వద్ద కూర్చో కానీ ఏదో ప్రొటోకాల్ అని దాన్ని అడ్డుపెట్టుకుని అభివృద్ధిని అడ్డుకుంటే మాత్రం నిన్ను వదిలేది లేదని అన్నారు. నియోజకవర్గ ప్రజలందరూ మీ ఇంటి ముందు వచ్చి కూర్చునే సమయం ఆసన్నమైందని ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చేదాక విడిచిపెట్టమని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చేతగాని సవాల్ విసిరాడని మాటమీద నిలబడే వ్యక్తివి అయితే రాజీనామా చేస్తా అన్నావ్ కదా వెంటనే చేసి డిపాజిట్ తెచ్చుకో చాలు కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోకపోతే నేను రాజకీయ సన్యాసం తీసుకుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

పడిలేచిన మర్రిచెట్టు వద్ద ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పూజలు

ముప్కాల్, మార్చి9: మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా శనివారం ముప్కాల్ మండల కేంద్రంలోని పడిలేచిన మర్రిచెట్టు వద్ద బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పూజలు నిర్వహించారు. ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా ముప్కాల్ మండల కేంద్రంలోని పడిలేచిన మర్రిచెట్టు వద్ద బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి శివలింగానికి దర్శించు కొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికి ఆలయ పురోహితు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం కాంగ్రెస్ నాయకులు సుదర్శన్‌రెడ్డికి శాలువతో సన్మానించి మెమోంటోను అందజేశారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గడుగు గంగాధర్, మండల అధ్యక్షుడు ముత్యంరెడ్డి, ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్‌హందాన్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


ముప్కాల్ పడిలేచిన మర్రిచెట్టు వద్ద పూజలు

ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని పూజలు

● నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

జక్రాన్‌పల్లి, మార్చి9: ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. శనివారం మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా మండలంలోని పడకల్ గ్రామంలో శివాలయం, రామాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఈనెల 11న ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఎం.సాయిరెడ్డి, మాజీసర్పంచ్‌లు ఎం.చిన్నసాయిరెడ్డి, మండల కాంగ్రెస్ యువజన విభాగం అధ్యక్షుడు వినోద్, కాంగ్రెస్ నాయకులు పురుషోత్తం, అరుణ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇందల్‌వాయి: రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలోకి సొసైటీ వైస్ చైర్మన్ మారుతి చేరారు. ఇందల్‌వాయి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వైస్ చైర్మన్ మారుతి శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఆయనను ఎమ్మెల్యే భూపతిరెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నవీన్‌గౌడ్, సొసైటీ డైరక్టర్ సుధాకర్,తదితరులు ఉన్నారు.

అంత్యక్రియాల్లో పాల్గొన్న రూరల్ ఎమ్మెల్యే

జక్రాన్‌పల్లి: శ్రీరాంసాగర్‌ప్రాజెక్టు ఎస్సారెస్పీ లక్ష్మీకాలువ హెడ్‌రెగ్యులేటర్ వద్ద జలశయంలో మహాశివరాత్రి సందర్భంగా దైవదర్శనానికి వెళ్లి స్నానం చేసేందుకు దిగి మండలంలోని గన్యాతాండా గ్రామానికి చెందిన అజ్మీర సాయికిరణ్, అజ్మీర సాయినాథ్, బనవత్ లోకేష్ నీట మునిగి మృతి చెందగా శనివారం జరిగిన వీరి అంత్యక్రియాల్లో నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి పాల్గొన్నారు.


పడకల్ శివాలయంలో పూజలు చేస్తున్న నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే

బీజేపీ ఆధ్వర్యంలో నినాదాల ప్రదర్శన

రుద్రూరు, మార్చి 9: మళ్లీ మోదీ సర్కార్ రావాలంటూ, నేను మోదీజీ కుటుంబ సభ్యుడిని అంటూ నినాదాలు చేస్తూ మండలంలోని రుద్రూరులో ప్రదర్శన చేశారు. శనివారం పార్టీ మండల అధ్యక్షుడు హరికృష్ణ ఆధ్వర్యంలో నినాదాలు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరోసారి మోదీ ప్రభుత్వం వచ్చినప్పుడే దేశం సస్యశ్యామలంగా అభివృద్ధి చెందుతుందన్నారు. అందరినీ ఆదుకునేందు కోసం మోదీ సర్కార్ ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏముల గజేందర్, వడ్ల సాయినాథ్, కుమ్మరి గణేష్, సంజీవ్, యాదగిరిలు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణం కార్యరూపం దాల్చేనా?

● ఎస్ఎస్‌పి రోడ్డు నుంచి లింగంపల్లి వరకు ● ఆరేడు జడ్పీ రోడ్డు నుంచి మర్పల్లి వరకు బీటి రోడ్ల నిర్మాణం ● గత ప్రభుత్వం రూ.6.70 కోట్లు మంజూరు చేశారు



ఎస్ఎస్ఏ రోడ్డు నుంచి అచ్చంపేటకు వెళ్లే రహదారి ఇదే



ఆరేడు జిల్లా పరిషత్ రహదారి నుంచి మర్పల్లికి వెళ్లే రహదారి ఇదే



అచ్చంపేట రోడ్డు నుంచి మర్పల్లికి వెళ్లే రహదారి ఇలా

నిజాంసాగర్, మార్చి 9: ఎన్నో ఏళ్లుగా ఆయా గ్రామాల ప్రజలు ఎదురు చూసిన కల నెరవేరినట్లే అనిపించి, తిరిగి పాత బాటే పట్టడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను ఎస్‌డీఎఫ్ నిధులను మంజూరుచేశారు. ఈ రహదారి నిర్మాణానికి సెప్టెంబరులో శంకుస్థాపన చేశారు. మొదటి దఫా టెండర్లు పిలిచారు. ఆయా గ్రామాల రహ దారులు బీటి రోడ్లుగా మారుతాయని ఎదురు చూస్తున్నారు. రూ.6కోట్ల 70 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులు విడుదల చేయగా, సెప్టెంబరులో నిర్మాణం పనులకు అప్పటి ఎమ్మెల్యే హన్మంత్ షిండేతో పాటు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ దఫేదార్ శోభ రాజు శంకుస్థాపనలు చేశారు.వివరాల్లోకి వెళితే నిజాంసాగర్ మండలం ఎస్ఎస్ఏ రహదారి నుంచి లింగంపల్లి వరకు రూ. 4 కోట్లతో బీటి రోడ్డుకు నిధులు మంజూరు చేశారు. ఆరేడు జిల్లా పరిషత్ రహదారి నుంచిబ్రాహ్మణ్‌పల్లి మీదుగా మర్పల్లి వరకు రోడ్డు పనులు నిర్మాణం పనులు చేపట్టేందుకు రూ.2 కోట్ల 70 లక్షల మంజూరు చేశారు. ఈ నిధులతో ఎన్నో రోజులుగా రహదారి నిర్మాణాలకు నోచుకోని బ్రాహ్మణపల్లి, మర్పల్లి, అచ్చంపేట, లింగంపల్లి గ్రామాల రహదారులకు మహర్దశ వస్తోందని ఎదురు చూసిన ప్రజలకు నిరాశే మిగిలింది. సెప్టెంబరు నెలలో బీటి రోడ్డు నిర్మాణం పనులకు పంచాయతీ రాజ్ శాఖ మొదటి దఫా టెండర్లను పిలిచినప్పటికి ఏ ఒక్కరూ కూడా టెండర్లలో పాల్గొనలేక పోయారు. దీంతో అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో పంచాయతీరాజ్ అధికారులు మరో దఫా రహదారి నిర్మాణాలకు టెండర్ల ప్రక్రియ పూర్తి చేయకపోయారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 6 కోట్ల 70 లక్షలను స్టేట్ ఎస్‌డీఎఫ్ నిధులను మంజూరుచేశారు. ఈ నిధులతో రహదారి నిర్మాణాలు ముందుకు సాగడం లేదు. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూసిన రహదారి పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. గత ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను ఎస్‌డీఎఫ్ నిధులు రద్దు చేశారా? ఈనిధులతో కొత్తగా టెండర్ల ప్రక్రియ పూర్తి చేశారా?అంతు చిక్కడం లేదు. 40 ఏళ్లుగా రహదారి వెంట వెళ్లే ప్రజలు, రైతులు నరక యాతన పడుతున్నారు. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా ఈ రహదారిని 2023 వరకు పట్టించుకునే పాపాన లేకపోవడంతో, అప్పటి ఎమ్మెల్యే హన్మంత్ షిండే ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరు చేయించి రోడ్డు నిర్మాణాలు చేపడతామనే తరుణంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాలేక పోయింది. అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం రూ. 6 కోట్ల 70 లక్షలను కేటాయించేనా? ఈ రహదారి పనులకు శ్రీకారం చుట్టేనా? అని గ్రామాల రైతులు ఆవేదన చెందుతున్నారు. గ్రామాల అభివృద్ధియే లక్ష్యంగా పెట్టుకుని ప్రజా ప్రతినిధులు రహదారి పనులకు శ్రీకారం చుట్టాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా శివ పార్వతుల కల్యాణోత్సవం



మానాలలో శివ పార్వతుల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

కమ్మర్‌పల్లి, మార్చి 9: బాల్కొండ నియోజికవర్గం పరిధిలోని రాజన్నసిరిసిల్లా జిల్లా రుద్రంగి మండలం మారుమూల గ్రామం మానాలలో కొలువుదీరి ఉన్న శంబులింగేశ్వర స్వామి అలయంలో మహాశివరాత్రి పర్వదిన ఉత్సవాల్లో భాగంగా శనివారం శివ పార్వతుల కల్యాణోత్సవం కనులపండువగా ఘనంగా నిర్వహించారు. ఆలయఅర్చకులు మధుపూర్ణచందు ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల మధ్య శివపార్వతుల కల్యాణోత్సవాన్ని నిర్వహించగా ఆలయ కమిటీ అధ్యక్షుడు మూడారపు గంగారెడ్డి వీడీసీ చైర్మన్ గోపిడి రవీందర్‌రెడ్డి, కమిటీ పాలకవర్గ సభ్యులు స్వామివారి కల్యాణోత్సవ సందర్భంగా పట్టువస్త్రాలను సమర్పించారు. ఈసందర్భంగా గ్రామానికి చెందిన పలువురు దంపతులు ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన ఆలయావరణలో అన్నదాన కార్యక్రమంలో గ్రామస్థులు, గిరిజనులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండలవైస్ ఎంపీపీ పిసరి భూమయ్య మాజీ సర్పంచ్, ఎంపీటీసీలు వీడీసీ ఆలయ కమిటీ సభ్యులు స్వామివారికి నిర్వహించిన ప్రత్యేక పూజ, అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యార్థులంతా కలిసి మెలిసి ఉండాలి

● పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్

డిచ్‌పల్లి, మార్చి 9: వసతి గృహాల్లో విద్యార్థులు జూనియర్, సీనియర్ అని భేదాభిపాయాలు లేకుండా కలిసి మెలిసి ఉండాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ అన్నారు. ఇటీవల బోధన్ బీసీ హాస్టల్‌లో జరిగిన ఘటన నేపథ్యంలో శనివారం డిచ్‌పల్లి మండల కేంద్రంలో ఉన్న హాస్టళ్లలో విద్యార్థులతో సమావేశం నిర్వహించి పలు సూచనాలు చేశారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవీందర్, అక్షయ్, వరుణ్, సాయి, పాల్గొన్నారు.

టీయూలో ఎస్ఎఫ్ఐ దిష్టిబొమ్మ దహనం

డిచ్‌పల్లి, మార్చి 9: తెలంగాణ యూనివర్సిటీ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో శనివారం వర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎదుట ఎస్ఎఫ్ఐ దిష్టిబొమ్మ దహనం చేశారు.ఈ సందర్భంగా ఏబీవీపీ వర్సిటీ అధ్యక్షుడు సాయికుమార్ మాట్లాడతూ.. ఫిబ్రవరి 14న ప్రేమికుల రోజు సందర్భంగా కేరళ విద్యార్థిని సీనియర్‌లతో కలిసి డ్యాన్స్ చేసినందుకు కేరళలోని పోకోడ్ కేరళ వెటర్నరీ అండ్ ఎనిమల్ హస్‌బెండరీ యూనివర్సిటీ 2వ సంవత్సరం విద్యార్థి సిద్ధార్థ హత్యకు కారణమైన ఎస్ఎఫ్ఐ నాయకులను శిక్షించాలని డిమాండ్ చేశారు.కేరళ అధికార పార్టీ అయిన సీపీఐ (ఎం) విద్యార్థి సంస్థ స్టూడెంట్ ఫెడరేషన్‌ఆఫ్ ఇండియా ఆఫీస్ బేరర్లు దీని కారణంగా నిందితుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం మెతక వైఖరికి నిరసన చేయడం సరికాదని నిందితులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈనిరసన కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ నాయకులునాగరాజు, నాయకులు నాగరాజు, ఉపాధ్యక్షుడు అనిల్, తరుణ్, ప్రమోద్, మహేశ్, సాయికృష్ణ, పాల్గొన్నారు.

జహీరాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా సురేష్ షెట్కర్ ఎంపికపై హర్షం

కోటగిరి,మార్చి9: జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సురేష్ షెట్కార్‌ను ఎంపిక చేయడం పట్ల మండల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కోటగిరి మండల కేంద్రంలో శనివారం సంబరాలు నిర్వహించి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ కొట్టం మనోహర్ మాట్లాడుతూ పార్టీ అధిష్టానం సురేష్ షెట్కర్‌ను ఎంపీ అభ్యర్థిగా ఖరారు చేయడం అభినందనీయమన్నారు. పార్టీ నమ్ముకుని కష్టపడి పని చేసే నాయకులకు అధిష్టానం తగిన గుర్తింపు ఇస్తుందన్నారు. గతంలో జహీరాబాద్ ఎంపీగా సురేష్ షెట్కర్ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని, ఈ ఎన్నికలలో ఆయనను భారీ మెజారిటీతో గెలిపిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు షహీద్ హుస్సేన్, గంగాధర్ దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

రుద్రూరు:మండల కేంద్రంలో జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా సురేష్‌కుమార్ షెట్కార్‌కు టికెట్ కేటాయించడంతో మండల అధ్యక్షుడు తోట అరుణ్‌కుమార్, గ్రామఅధ్యక్షుడు పార్వతి ప్రవీణ్‌ల ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు సంబరాలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు బాణాసంచాలు కాల్చి స్వీట్లను పంచుకుని హర్షం వ్యక్తం చేశారు. అనంతరం మండల అధ్యక్షుడు తోట అరుణ్ కుమార్ మాట్లాడుతూ జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి సురేష్‌కుమార్ షెట్కార్‌ను భారీ మెజారిటీతో గెలిపించి పార్లమెంట్‌కు పంపుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు నడిపింటి నగేష్, కిసాన్ కేత్ మండల అధ్యక్షుడు అడప సాయిలు, ఎంపీటీసీ గౌస్, ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు కర్కే అశోక్, వార్డుమెంబర్ నిస్సార్, మాశెట్టి శ్రీనివాస్, గంగాధర్, దువ్వ రవి, సీనియర్ నాయకులు గోపాల్ రావు, దత్తు, తదిత రులు పాల్గొన్నారు

మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

పెద్దబజార్, మార్చి 9:మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్‌ను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని అన్నారు. కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం మతోన్మాదా విధానాలను వేగవంతం చేస్తుందన్నారు. శ్రమను, శ్రమ చేసే మహిళలను గౌరవించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళ హక్కుల మానవ హక్కుల్లో భాగంగా కాని బీజేపీ ప్రభుత్వ మహిళల హక్కులను హరిస్తోందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్, స్వర్ణ, సుకన్య, రేవతి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

నవీపేట,మార్చి9: మండలంలోని జన్నేపల్లిలో ఈ నెల 7న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కంచర్ల రమేష్(38)అనే మేస్త్రీ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడని ఎస్ఐ యాదగిరి గౌడ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా ఆత్మకూర్ మండలం మల్ల కాలువ గ్రామానికి చెందిన రమేష్ నెల రోజుల క్రితం గ్రామంలో మేస్త్రీ పని చేయడానికి స్థానిక రంగస్వామి అనే మేస్త్రీ వద్ద పనికి కుదిరాడు. ఇటీవల స్వగ్రామానికి వెళ్లిన ఆయన ఈ నెల 7న జన్నేపల్లికి వచ్చి బస్సు దిగి నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన టీవీఎస్ ఎక్సెల్ మోపెడ్ వాహనం ఢీకొనడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతనిని నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్ఐ పేర్కొన్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారని ఆయన పేర్కొన్నారు. పెద్ద మేస్త్రీ రంగస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. రమేష్ మృతదేహన్ని పోస్టుమార్టం అనంతరం అతని స్వగ్రామానికి తరలించడం జరిగిందని ఎస్ఐ తెలిపారు.

కామ్రేడ్ రవి ఆశయ సాధన కోసం పోరాడుదాం



రవి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మాస్‌లైన్ నాయకులు

సిరికొండ మార్చి 9 : గోదావరి లోయ ప్రతిఘటన పోరాట యోదుడు కామ్రేడ్ రాయల రవి ఆశయ సాధన కోసం పోరాడుదామని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు రామకృష్ణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సీపీఐఎంఎల్ కేంద్ర కమిటి సభ్యులు రాష్ట్ర కార్యదర్శి రాయల రవి 8 వర్ధంతి సందర్భంగా సిరికొండ మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి రాష్ట్ర నాయకులు రామకృష్ణ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన ఏ లక్ష్యం కోసమైతే పోరాడడాడో ఆ లక్ష్య సాధన కోసం మనమందరం ఉద్యమిద్దామన్నారు.జనతా ప్రజాతంత్ర్య విప్లవ సాధన కోసం పనిచేయడమే ఆయనకు నిజమైన నివాళులు అర్పించినట్లు అవుతుందన్నారు.కామ్రేడ్ రవన్న 40 ఏళ్ల ప్రజల హక్కుల సాధన కోసం అజ్ఞాత జీవితం గడిపాడని ఆయన వివరించారు.అడవీ , మైదాన ప్రాంత ఉద్యమాలను సమన్వయం పరుస్తూ పేద ప్రజలను దోపిడి, పీడనల నుండి విముక్తి కోసం తన రక్తాన్ని దారపోసిన గొప్ప పోరాట యోదుడని రామకృష్ణ కొనియాడారు.పెట్టుబడి దారులు కార్మిక వర్గా శ్రమను ఏవిదంగా దోపిడి చేస్తున్నారో కార్మికులకు వివరించి ఉద్యమాల వైపు నడిపించిన విధానం గొప్పదన్నారు. అందుకని సమిష్టి పోరాటాలను చేస్తు రవి ఆశయాల సాదన కోసం ఉద్యమించాలని అప్పుడే రవన్న ఆశయ సాధన కోసం పనిచేసిన వారమవుతామని రామకృష్ణ అన్నారు. ఈ సమావేశంలో పీవైఎల్ జిల్లా అధ్యక్షులు అనీస్,రమేష్,దామోదర్,లింబాద్రి,సాయరెడ్డి, రమేష్,సాయిలు,రాజ్‌కిషోర్,నరేష్,బబ్లూ,రామన్న,నాగన్న,బాబురావు తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: విప్లవ ప్రతిఘటన పోరాట యోధుడు కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోస్ 8వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని తట్టికోటలో సీపీఐ ఎంఎల్ ప్రజా పంథా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజా పంథా బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి మల్లేష్ మాట్లాడుతూ కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోస్ తన విద్యార్థి దశ నుంచి తుది శ్వాస వరకు ప్రతి ఘటన పోరాట యోధుడిగా పని చేశారని ఈ కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పడాల శంకర్, ప్రగతిశీల మహిళా సంఘం అధ్యక్షురాలు నాగమణి, జి.సీతారాం, సీహెచ్ గంగారాం, పోశెట్టి, శంకర్, రాజు, సుశీల, శంకర్, అరుణ, సలీం, మహేష్, రమేష్ తదితరులు ఉన్నారు.

మోర్తాడ్: గోదావరి లోయ ప్రతిఘటన యోధుడు కామ్రేడ్ రవన్నకు సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. మండల కేంద్రంలో రవన్న అలియస్ రాయల్ సుబాష్‌చంద్ర బోస్ 8వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆర్మూర్ డివిజన్ నాయకులు కిషన్ మాట్లాడుతూ ఆదివాసుల విముక్తి కోసం వారికి భూమి హక్కు కల్పించడానికి 40ఏళ్ల అజ్ఞాత జీవితంలో అనేక పోరాటాలు నిర్వహించిన గొప్ప విప్లవ యోధుడు అని కొనియాడారు. ఈ కార్యక్ర మంలో మండల నాయకులు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పెద్దబజార్:ప్రజాతంత్ర విప్లవ యోధుడు రాయలసుభాష్‌చంద్రబోస్ అని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ అన్నారు. నగరంలోని కోటగల్లీలో గల ఎన్ఆర్‌భవన్‌లో శనివారం భారత విప్లవ పోరాట యోధుడు రాయలసుభాష్‌చంద్రబోస్ 8వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆదాని, అంబానీలాంటి కొద్ది మంది కార్పొరేట్ సంస్థల అమెరికాలాంటి సామ్రాజ్యవవాదుల బడా పెట్టుబడి ఫైనాన్స్ క్యాప్టల్‌తో మోడి, షా పాలన దేశంలో ఫాషిజాన్ని ఆజ్యం పోస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ నాయకులు యాదగిరి, వెంకన్న, రాజేశ్వర్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని కుమార్‌నారాయణ భవన్‌లో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథ ఆధ్వర్యంలో శనివారం కామ్రేడ్ రవన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీపీఐఎంల్ మాస్‌లైన్ ప్రజాపంథ డివిజన్ కార్యదర్శి దేవరాం మాట్లాడుతూ గోదావరి లోయ ప్రతిఘటన యోధుడు కామ్రేడ్ రవన్న అని ఆయన ఆశయం సాధించిన నాడే ఘనమైన నివాళి అర్పించినట్టు అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా నాయకులు ఎన్.ముత్తెన్న, డివిజన్ నాయకులు ఆకుల గంగారాం, రాజన్న, రగూర్, శేఖర్, నరేందర్, నజీర్, పీడీఎస్‌యు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రెంజల్: కామ్రేడ్ రవన్నను ఆదర్శంగా తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర నాయకులు పార్వతి రాజేశ్వర్ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని బోర్గాం గ్రామంలో కామ్రేడ్ రవన్న 8వ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పుట్టి నాగన్న, ఒడ్డెన్న, నసీర్, పోశెట్టి, రవి, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథ) కార్యకర్తలు ప్రజల మధ్య ఉంటూ ప్రజాసమస్యలపై పోరాడి సాధించుకున్న రోజునే సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ కేంద్రకమిటీ సభ్యులు రాష్ట్రకార్యదర్శి రాయల సుభాష్ చంద్రబోస్(రవి)కి నిజమైన నివాళిఅని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ (ప్రజాపంథ) జిల్లా నాయకుడు సారాసురేష్ అన్నారు.శుక్రవారం పార్టీ కార్యాలయంలో రాయలసుహాష్ చంద్రబోస్ 8వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలువేసి నివాళులర్పించి రెండు నిముషాలు మైనం పాటించారు. కార్యక్రమంలో కమ్మర్‌పల్లి కమిటీ కార్యదర్శి అశోక్, ఆర్మూర్ డివిజన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జన్నెపల్లిలో రెండు బైక్‌ల ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు

నవీపేట,మార్చి9: మండలంలోని జన్నెపల్లిలో శనివారం సాయంత్రం రెండు బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జన్నెపల్లికి చెందిన రచ్చ నవీన్, అతని భార్య లయతో పాటు నవీన్ మేన కోడలైన 8 సంవత్సరాల చికితతో కలిసి స్థానిక శివాలయానికి బైక్‌పై వెళ్లారు. తిరిగి బైక్‌పై ఇంటికి వస్తుండగా వెనుక నుంచి వచ్చిన మరో బైక్ ఢీకొనడంతో ముందు బైక్‌పై ఉన్న నవీన్ కాలికి తీవ్ర గాయాలు కాగా అతని మేన కోడలైన చికిత తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బాధితులను ప్రైవేటు వాహనంలో జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.ఈ ప్రమాదంలో నవీన్ భార్య లయకు స్వల్ప గాయాలయ్యాయి. వెనుక నుంచి బైక్‌పై వచ్చి ఢీకొట్టిన ఇద్దరు యువకులు మండలంలోని యంచకు చెందిన వారుగా స్థానికులు పేర్కొన్నారు. ఈ విషయంపై ఎస్ఐ యాదగిరి గౌడ్‌ను వివరణ కోరగా జన్నెపల్లిలో రెండు బైక్‌లు ఢీకొన్న మాట నిజమేనని ఈ విషయంపై శనివారం సాయంత్రం వరకు తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని అన్నారు.

బీసీ ఉద్యోగుల సంఘాన్ని బలోపేతం చేయాలి

నిజామాబాద్‌అర్బన్, మార్చి 9: బీసీ ఉద్యోగుల సంఘాన్ని బలోపేతం చేయాలని, అన్ని శాఖల్లో సభ్యత్వం నమోదు చేయాలని జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నరాలసుధాకర్ అన్నారు. శనివారం నగరంలోని కేర్ డిగ్రీ కళాశాలలో బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు కరిపే రవీందర్ అధ్యక్షతన జరిగింది. బీసీ ఉద్యోగుల సంఘాన్ని జిల్లాలో మరింత బలోపేతం చేయాలన్నారు. మాజీ మంత్రి హరీష్‌రావ్ ఉద్యోగులను కించపరుస్తు మాట్లాడడం సరికాదని దానిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సలహాదారులు ఆకుల ప్రసాద్, చంద్ర మోహన్, ప్రభాకర్, దేవేందర్, పాల్గొన్నారు.

సాలూరలో హోరా హోరీగా కుస్తీ పోటీలు

బోధన్ రూరల్, మార్చి9: సాలూర మండల కేంద్రంలో శనివారం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో కుస్తీ పోటీలు నిర్వహించగా హోరాహోరీగా కొనసాగాయి. కుస్తీ పోటీలలో గెలుపొందిన విజేతలకు నిర్వాహకులు నగదును అందజేశారు. కుస్తీ పోటీలను తిలకించడానికి సాలూరతో పాటు చుట్టూ పక్కల గ్రామస్థులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కుస్తీ పోటీలలో బోధన్ చుట్టూ పక్కల ప్రాంతాల నుంచే కాక మహారాష్ట్ర, కర్నాటకల నుంచి మల్లయోధులు పాల్గొన్నారు. కుస్తీ పోటీలు హోరా హోరీగా కొనసాగాయి. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ అల్లె జనార్ధన్, గ్రామ పెద్దలు అల్లె రమేష్, శివాలయం కమిటీ అధ్యక్షుడు డడేన్ శంకర్, నగేష్ పటేల్, నాగేష్, గంగయ్య, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

చిక్కడపల్లిలో

రుద్రూరు: రుద్రూరు మండలంలోని చిక్కడ్‌పల్లి గ్రామంలో శనివారం కుస్తీ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా కి.శే. కిషన్‌రావు పటేల్ స్మారకార్థం కుస్తీ పోటీలను నిర్వహించామని వారి కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఈ కుస్తీ పోటీలలో గెలుపొందిన వారికి నగదు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: మండలంలోని జన్నేపల్లిలో శనివారం కుస్తీపోటీలు నిర్వహించారు. స్థానిక చారిత్రక శివాలయంలో జరిగిన మహా శివరాత్రి ఉత్సవాలలో భాగంగా రెండో రోజైన శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం జరిగిన కుస్తీపోటీలలో జిల్లాలోని పలు ప్రాంతాలతో పాటు మహారాష్ట్ర నుంచి పెద్ద ఎత్తున మల్లయోధులు కుస్తీపోటీలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



జన్నేపల్లిలో జరిగిన కుస్తీపోటీలలో పాల్గొన్న మల్లయోధులు



మైలారంలో కుస్తీ పోటీల్లో తలబడుతున్న మల్లయోధులు

రసవత్తరంగా కుస్తీ పోటీలు

నసురుల్లాబాద్, మార్చి 9: మండలంలోని మైలారం గ్రామంలో శనివారం మహా శివరాత్రి పండుగను పురస్కరించుకుని రాజరాజేశ్వర ఆలయం వద్ద గ్రామస్థులు కుస్తీ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా కుస్తీ పోటీలను నిర్వహించామన్నారు. ఈ కుస్తీ పోటీలకు మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి మలయోధులు విచ్చేసి కుస్తీ పోటీల్లో తలపడ్డారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు ఆలయ కమిటీ సభ్యులు, మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

నేడు కొర్పోల్‌లో శివాలయం వద్ద కుస్తీ పోటీలు

లింగంపేట, మార్చి 9 : మహా శివరాత్రి సందర్భంగా మండలంలోని కొర్పోల్‌లో శివాలయం వద్ద ఆదివారం కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. మండలంలోని మెంగారం రాజరాజేశ్వర ఆలయం వద్ద, అయ్యపల్లి ప్రభుస్వామి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



బోనాలు తీసుకు వస్తున్న మహిళలు

గంగమ్మ తల్లికి బోనాలు

బీబీపేట, మార్చి 9: మండల కేంద్రంలో గంగమ్మతల్లికి గంగపుత్ర కులస్థులు బోనాలు, చలువ పందిరి సమర్పించారు. ప్రతీయేట శివరాత్రి మరుసటి రోజు గంగమ్మతల్లికి బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని గంగమ్మ ఆలయాన్ని పువ్వులతో, మామిడి తోరనాలతో, విద్యుత్ దీపాలతో అలంకరించారు. అనంతరం భక్తి శ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గంగపుత్ర సంఘం సభ్యులు, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



దామరంచ శివారులో కాలువ పూడికతీత చేపడుతున్న దృశ్యం

25వ ఉప కాలువలో పూడికతీతకు శ్రీకారం

బీర్కూర్, మార్చి 9: నిజాంసాగర్ ప్రధాన కాలువకు అనుసంధానంగా ఉన్న 25వ డిస్ట్రిబ్యూటరీ కాలువలో అడ్డగోలుగా పిచ్చి మొక్కలు పెరిగాయి. చెత్తాచెదారం చేరింది. దీంతో 25వ ఉప కాలువ ద్వారా పంట పొలాలకు సాగునీరు అందడం లేదు. కాలువ పూడికతీత చేపట్టాలని చివరి ఆయకట్టు రైతులు నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. రవీందర్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం బీర్కూర్ మండలం దామరంచ గ్రామ శివారులో గల 25వ కాలువలో పూడికతీత చేపట్టారు. దామరంచ సొసైటీ ఛైర్మన్ కమలాకర్‌రెడ్డి తన సొంత ఖర్చుతో నిజాంసాగర్ 25 డిస్ట్రిబ్యూటరీ కెనాల్ పూడికతీత పనులు ప్రారంభించినట్లు స్థానిక రైతులు తెలిపారు. రవీందర్‌రెడ్డికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ కమలాకర్‌రెడ్డి, స్టేట్ మైనారిటీ జనరల్ సెక్రెటరీ ఎక్బాల్, రైతులు మోహన్‌రావు, బసోల్ల అంజయ్య, జింక సాయిలు, బండారు రాజు తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

నిజాంసాగర్, మార్చి 9: మహ్మద్‌నగర్ మండలంలోని సింగీతం గ్రామంలో శనివారం మాజీ జడ్పీటీసీ జయ ప్రదీప్ సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. గ్రామంలో కొన్ని కాలనీల్లో సీసీ రోడ్లు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న దృష్ట్యా రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయడంతో పనులు ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవీందర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షురాలు శారద, ఆకాష్, గంగారెడ్డి, రఫి, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

శివాలయాల్లో అన్నదానం

బీర్కూర్, మార్చి 9: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు పెద్ద సంఖ్యలో శివాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఇదిలా ఉండగా శనివారం బీర్కూర్ మండల కేంద్రంలోని జోడు లింగేశ్వర ఆలయ సన్నిధిలో, కామప్ప ఆలయ సన్నిధిలో మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కఠినమైన ఉపవాస దీక్షలు చేపట్టిన భక్తులు ఆలయాలకు చేరుకుని మొదట శివయ్యను దర్శించుకున్నారు. అనంతరం ఆలయ సన్నిధిలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ఉపవాస దీక్షలను విరమించారు.

పెద్ద కొడప్‌గల్: మండలంలోని కాటేపల్లిలో గల శివాలయంలో మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామస్థులు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని హనుమాన్ ఆలయం నుంచి భజనమండలి ఆధ్వర్యంలో భజన, ర్యాలీతో ఆలయానికి చేరుకున్న గ్రామస్థులు శివుడికి అభిషేకం చేశారు. ఆలయం ముందు నూతన ధ్వజాన్ని ఏర్పాటు చేశారు. ఆలయంలో శివుడికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం నైవేద్యం సమర్పించారు. జుక్కల్ మండలంలోని కౌలాస్ గ్రామంలో మహంతేశ్వర మల్లికార్జున స్వామి మఠంలో భ్రమరాంబ-మల్లికార్జున స్వామి కల్యాణ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావ్ హాజరై స్వామి వారి కల్యాణ సేవలో పాల్గొన్నారు. కల్యాణ వేడుకల అనంతరం మఠాధిపతులు ఎమ్మెల్యేకు ఆశీస్సులు అందజేసి, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భగవంతున్ని నిష్ఠతో సేవ చేస్తే భగవంతుని కృపకు పాత్రులు కావచ్చని సూచించారు. ఈ నెల 11 నుంచి సద్గురు మహదేవ్ స్వామీజీ ఆధ్వర్యంలో జరగబోయే మహా పాదయాత్ర ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వినోద్, రమేష్ దేశాయి, గంగారెడ్డి, మర్చి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్ : జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిజాంసాగర్ చంద్రమౌళేశ్వరాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివరాత్రి ఉత్సవాల్లో శివునికి అభిషేకాలు చేయడం చాలా శుభప్రదమన్నారు. ఉమ్మడి నిజాంసాగర్ మండలంలోని పలు గ్రామాల్లో శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అచ్చంపేట సంగమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మహా శివరాత్రి సందర్భంగా ఉపవాస దీక్షలు చేపట్టిన భక్తులు శనివారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.కొమలంచ శివాలయం, బూర్గుల్, నర్వ, తదితర గ్రామాల్లో ఆలయాలు భక్తులతో కిటకిట లాడాయి.

మద్నూర్: మండల కేంద్రంలోని సోమ లింగేశ్వరాలయాన్ని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రసిద్ధి చెందిన ఆలయానికి తమ హయాంలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించినట్లు గుర్తు చేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, సంజయ్, హన్మాండ్లు, సుభాష్, దేవిదాస్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

నసురుల్లాబాద్: దుర్కి సోమలింగాల దేవస్థానం వద్ద శనివారం పోచారం కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట సతీమణి పుష్ప, కుమారుడు పోచారం సురేందర్‌రెడ్డి, స్థానిక మండల నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు భక్తులు పాల్గొన్నారు.

త్రిలింగ రామేశ్వరాలయం చుట్టూ ఎడ్లబండ్ల ప్రదర్శన

నాగిరెడ్డిపేట: తాండూర్ త్రిలింగ రామేశ్వర దేవాలయం వద్ద శనివారం సాయంత్రం ఎడ్లబండ్ల ప్రదర్శన అంగరంగ వైభవంగా జరిగింది. ఎడ్లబండ్లను అందంగా అలంకరించుకుని తీసుకువచ్చి ఆలయం చుట్టూ తిప్పారు. కొందరు ట్రాక్టర్ల యజమానులు తమ ట్రాక్టర్లను ఆలయం చుట్టూ తిప్పారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు దత్తు, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, వివిధ పార్టీల నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. త్రిలింగ రామేశ్వరాలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం జబర్దస్త్ ఫేమ్ కొమురక్క ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని కొమురక్క కార్యక్రమాన్ని తిలకించాలని ఆలయ కమిటీ నిర్వాహకులు కోరారు.



బీర్కూర్‌లో మల్లన్న ఆలయ సన్నిధిలో అన్నదానంలో పాల్గొన్న భక్తులు

రుద్రారం శివాలయంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే పూజలు

ఎల్లారెడ్డి: శివరాత్రి పర్వదినం సందర్భంగా ఎల్లారెడ్డి మండలంలోని రుద్రారం గ్రామంలో ఉన్న శివాలయంలో శనివారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం గ్రామ ప్రజలతో కలిసి జాతరలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లారెడ్డి అభివృద్ధికి ఎల్లవేళలా సేవ చేస్తానని అన్నారు. గత పాలకులు ఎల్లారెడ్డి నియోజకవర్గాన్ని పట్టించుకోలేదని ప్రస్తుతం తాము అధికారంలో ఉన్నామని ఎల్లారెడ్డిని అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ వెంకట రమణారెడ్డి, మల్కారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



రుద్రారం ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు



తాండూర్ త్రిలింగ రామేశ్వరాలయం చుట్టూ ఎడ్లబండ్ల ప్రదర్శన



కౌలాస్‌లో కల్యాణ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే తోట

కాంగ్రెస్‌లో పలువురి చేరికలు

పెద్ద కొడప్‌గల్, మార్చి 9: జుక్కల్ బీఎస్పీ మండల అధ్యక్షుడు విలాస్‌తో పాటు సొసైటీ మాజీ ఛైర్మన్ రాములుతో పాటు పలు గ్రామాలకు చెందిన యువకులు శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. బీఎస్పీ మండల అధ్యక్షుడు విలాస్ మాట్లాడుతు రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు బాగున్నాయన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన 20వ వార్డు కౌన్సిలర్

కామారెడ్డి టౌన్: కామారెడ్డి పట్టణంలోని 20వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ ఫైమా సుల్తానా సలీంలు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ ఆమెకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్: మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు శనివారం ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు భూమిరెడ్డి, మండల మైనార్టీ నాయకుడు, వ్యవసాయమార్కెట్ కమిటీ డైరెక్టర్ సాదక్‌అలీ కాంగ్రెస్‌లో చేరగా వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

నాగిరెడ్డిపేట: మండలంలోని మాటూర్ గ్రామ తాజా మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ అమలుపరుస్తున్న ఆరు గ్యారెంటీ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ఆయన తెలిపారు. కృష్ణారెడ్డికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎల్లారెడ్డి కాంగ్రెస్ నాయకులు ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి నియోజకవర్గానికి చెందిన వివిధ మండలాల టీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన 6 గ్యారంటీలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారన్నారు. కాంగ్రెస్ హయాంలో అన్ని వర్గాల వారికి న్యాయం జరుగుతుందని ఆయన అన్నారు.

రాజంపేట: మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ బీరయ్య, ఉప సర్పంచ్ ప్రకాష్ వార్డు మెంబర్స్ పోశయ్య బీఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రెటరీ ఎల్లేశం శనివారం ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధి పనులను ఆకర్షితులై పార్టీలో చేరామని తెలిపారు.



నాగిరెడ్డిపేటలో ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరుతున్న మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి



కామారెడ్డిలో కాంగ్రెస్‌లో చేరుతున్న కౌన్సిలర్ ఫైమాసుల్తానా



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే తోట

కామారెడ్డిని షబ్బీర్‌అలీకి సీఎం రేవంత్‌రెడ్డి రాసిచ్చాడా?

● కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి

కామారెడ్డి టౌన్, మార్చి 9: కామారెడ్డిని షబ్బీర్‌అలీకి సీఎం రేవంత్‌రెడ్డి రాసిచ్చాడా అని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. శనివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌ను ఆయన తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సిబ్బంది హాజరు పట్టికలను పరిశీలించారు. డైట్, శానిటేషన్, కమర్షియల్ దుకాణాల కేటాయింపు, సులభ్‌కాంప్లెక్స్, ఆరోగ్యశ్రీ నిధులు, ఖర్చులతో పాటు పై అంతస్తులో ఏర్పాటు చేసిన అదనపు పడకల ప్రారంభోత్సవానికి ప్రొటోకాల్ విషయంపై అధికారులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ప్రొటోకాల్ ప్రకారం ప్రభుత్వ సలహాదారుడు మహ్మద్‌అలీ షబ్బీర్‌ను ఆహ్వానించారని అన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు చెందిన ఆసుపత్రిలో ప్రారంభోత్సవాలు చేస్తే మిగిలిన ఎమ్మెల్యేలను ఎందుకు ఆహ్వానించలేదని ఒక జడ్పీ వైస్ ఛైర్మన్ క్యాడర్ ఉన్న వ్యక్తిని ఏ విధంగా ప్రొటోకాల్‌లో చేరుస్తారని ప్రశ్నించారు. ఏ జీవో ప్రకారం ప్రొటోకాల్‌లో చేర్చారో కలెక్టర్ సమాధానం ఇవ్వాలని అన్నారు. రాష్ట్రంలో మరో నలుగురు ప్రధాన సలహాదారులు ఉన్నారని మరి వారేందుకు అన్ని జిల్లాలో అభివృద్ధి పనులకు హాజరుకావడం లేదని అన్నారు. పోని జిల్లాలోని మరో మూడు నియోజకవర్గాల్లో ఎందుకు ఇతర కార్యక్రమాల్లో పాల్గొనడం లేదో సమాధానం ఇవ్వాలని అన్నారు. గత రెండు రోజులుగా ఈ ఇష్యూపై తీవ్ర స్థాయిలో చర్చజరుగుతుందని ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరయ్యేందుకు ప్రయత్నాలు చేయడంతో పాటు తనకు ఫోన్ ద్వారా మాట్లాడాడని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న మంత్రులతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి హాజరైన తాను చిట్టచివరన నిల్చుంటానని అసలు ప్రొటోకాల్‌తో సంబంధం లేని వ్యక్తిని ఏ విధంగా విశిష్ట అతిథిగా చేర్చుతారని ప్రశ్నించినట్లు తెలిపారు. అదేవిధంగా ఎన్ఆర్‌జీఎస్ ఫండ్‌ను కలెక్టర్ చెప్పడంతో గత సర్పంచ్‌లకు రూ.4కోట వరకు అప్పు ఉన్నాయని వారు ఇబ్బంది పడవద్దని తాను గమ్మున ఉన్నానని దీంతో గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు పనులు చేస్తు రేవంత్‌రెడ్డికి, షబ్బీర్‌అలీకి శుభాకాంక్షలు చెబుతూ రోడ్డు వేస్తున్నారని అన్నారు. రోడ్ల నాణ్యతపై త్వరలో పరిశీలన చేపట్టి కేంద్ర, రాష్ట్ర విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. నాణ్యతగా పనులు చేపడితేనే బిల్లులు అందుతాయని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రిలో నిబంధనలకు నీళ్ల వదులుతున్నారని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత వైద్యం ఉంటుందేకాని ఒంటికి, రెంటికి వస్తే మాత్రం సులభ్ కాంప్లెక్స్‌లో ఐదు రూపాయలు ఇచ్చి వెళ్లాల్సి వస్తుందని అన్నారు. అసలు ఏ విధంగా సులభ్ కాంప్లెక్స్‌కు అనుమతి ఇచ్చారని అన్నారు. ఆరోగ్యశ్రీలో పెద్ద ఎత్తున అవకతవకలు జరుగుతున్నాయని అన్నారు. ఇకమీదట అధికారులు నిబంధనల ప్రకారం నడుచుకోకుంటే తాను ఉరుకునే ప్రసక్తే లేదని ప్రొటోకాల్ ఇష్యూపై జీఏడీకి తాను ఫిర్యాదు చేయడంతో పాటు అసెంబ్లీలో లెవనెత్తుతానని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించింది

● రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ

కామారెడ్డి టౌన్, మార్చి 9: రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయంపై ప్రత్యేక దృష్టిపెట్టి ముందుకు సాగుతుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ అన్నారు. శనివారం కామారెడ్డి జీజీహెచ్‌లో మెడికల్, సర్జికల్, పోస్ట్ ఆపరేటివ్, డయాలసిస్ వార్డులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన వెనువెంటనే ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.10లక్షల వరకు పెంచామని అన్నారు. కామారెడ్డిలో అదనంగా వంద పడకలను ప్రారంభించా మని తెలిపారు. ఈ మధ్య డయాలసిస్ రోగుల సంఖ్య పెరగడం చాలా బాధాకరమని వారు పడుతున్న ఇబ్బం దులను చూసి అదనంగా ఇంకో ఐదు డయాలసిస్ బెడ్ల ను ప్రారంభించినట్లు తెలిపారు. త్వరలోనే మెడికల్ కళాశాలను సందర్శించి అవసరమైన సౌకర్యాల కోసం ప్రభుత్వానికి నివేదిస్తానని తెలిపారు. వైద్యశాఖ మంత్రి ని సైతం కామారెడ్డికి తీసుకువచ్చి ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న సమస్యలను పరిష్కరించేవిధంగా చూస్తానని తెలిపారు. తాను మంత్రిగా ఉన్నప్పుడు 30 పడకల ఆసు పత్రిని ఏరియా ఆసుపత్రిగా మార్చు చేశానని తెలిపారు. త్వరలో దోమకొండలో 100 పడకల ఆసుపత్రి ఏర్పాటుకు సీఎంతో మాట్లాడి ఏర్పాటు చేసేవిధంగా కృషి చేస్తానని తెలిపారు. అలాగే గత కాంగ్రెస్ ప్రభుత్వంలో మంజూ రైన 21,22 ప్యాకేజీ పనుల కోసం నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని కలిసి నిధులు కేటాయించాలని కోరానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, సూపరిటెండెంట్ రాంసింగ్, డిప్యూటీ సూపరిటెండెంట్ బన్సిలాల్, డీసీహెచ్‌సీ విజయలక్ష్మి, ఆర్ఎంలు శ్రీనివాస్, సుజాత, మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ ఇందుప్రియ, స్థానిక కౌన్సిలర్ గెరిగంటి స్వప్న, లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో మున్నూరు కాపులకు

సీట్లు కేటాయించాలని హరీష్‌రావుకు వినతి పత్రం



హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో హరీష్‌రావుకు వినతి పత్రం ఇస్తున్న లింగంపేట మున్నూరు కాపులు

లింగంపేట, మార్చి 9 : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ టికెట్లలో మున్నూరుకాపులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతూ శనివారం లింగంపేట మండల మున్నూరుకాపులు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి హరీష్‌రావును కలిసి వినతి పత్రం అందజేశారు. తెలంగాణలో జనాభాపరంగా అత్యధికంగా ఉన్న మున్నూరుకాపులకు రాజకీయంగా ప్రాధన్యత ఇవ్వాలని వారు కోరారు. ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లా మున్నూరుకాపు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండ బాలకిషన్ మాట్లాడుతూ మున్నూరుకాపు సామాజిక వర్గానికి పార్లమెంట్ సీట్లలో ప్రాధన్యత ఇచ్చే పార్టీలకు మున్నూరుకాపులు అండగా ఉంటారని ఆయన తెలిపారు. మున్నూరుకాపులను ఓటు బ్యాంకుగా కాకుండా రాజకీయాలలో ప్రాధన్యత ఇవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం నాయకులు మేకల రాములు, సంగయ్య, పోచయ్య, మల్లయ్య, సత్యనారాయణ, సురెందర్, మనోహర్, రాములు, మండలంలోని వివిధ గ్రామాల మున్నూరుకాపులు తరలి వెళ్లారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి	
దర్శన్	హనుమాన్
శాంతి	గామి
ప్రియా 70	భీమా
ప్రియా 35	ఆపరేషన్ వాలెంటైన్

బాన్సువాడ	
మహేశ్వరి	భీమా
వెంకటేశ్వర	గామి

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	100	160	180
వెన్‌కాబ్(కిలో)	100	180	210

